# పరిహాసుని వేలుపు

## శ్రీ శ్రీపతి

మేఘాల రోదన—ఆ కన్నీటిలో వర్షం. పశ్చిమ దిఙ్మండలంలో అరుణిమలు—రక్తం చిమ్ముతున్నట్టు. ఘోర రణ సూచన. కత్తుల క్రూరచలనంలా మెరుపులు. భీతావహంగావుంది. శూన్యంలో వంటరిగా చిక్కుకుంది. పెద్ద గాలి. క్రమంగా దుర్భరమవుతోంది. అంతవరకూ అక్కడ కన్పించిన వంశవృక్షం కన్పించడంలేదు. ఆ కలతో రత్నాలమ్మ కలవరపడింది. భయం వేసింది. పోలేరమ్మను తలంచుకొని కనులు తెరిచేసరికి ఉషోదయసంచలనంతో ప్రకృతి ఉషారుగా వుంది. కల జ్ఞాపకం తెచ్చుకోబోయింది. ఎంతకీ అందలేదు జ్ఞాపకం.

పెరట్లోకి రత్నాలమ్మ దృష్టి పోయింది. జామిచెట్టు, మల్లె పొద, దొండపాదు—తర్వాత కొంతదూరాన ఎండి మోడవుతోన్న మామిడి చెట్టు. ఇంకా దూరంగా దృష్టిపోతే నీలందిగంతాలు. ఆ మామిడిచెట్టు ఎండిపోతోన్నకొద్దీ మామయ్య ఆఖరి రోజుల్లో అనే మాటలన్నీ స్మృతిలో తటిల్లనడం, కళ్ళు చెమర్చడం, గుండె నీరసంతో బరువెక్కడం, ఆరోజా రోజంతా బందీలా బాధపడడం, గతమంతా కళ్ళముందు బలవంతంగా నాట్యమాడడం, భయం నిండిపోవడం, పోలేరమ్మని తలంచుకొని లేచి పనుల్లోకి దూరడం పరిపాటి అయింది.

ఆ చెట్టు వంశవృక్షం అనేవాడు మామ. ఆవృక్షం కళకళలాడిన్నాడు, యింట్లో కదురూ కవ్వం కిలకిల్లాడాయి. ఆ వృక్షం మూడు పూవు లారు కాయ లయింది. ఇల్లు నిత్య కళ్యాణం పచ్చ తోరణమయింది. ఆ వృక్షం మోడయిపోతోంది. సరి. ఆ పక్కనే ఆ చెట్టుకి వారసత్వంలా ఓ మొక్క వుంది. అయితే రత్నాలమ్మ ఆ మొక్కని నమ్మలేకపోతోంది. ఎన్ని మొక్కలు పుట్టలేదని! ఒక్క మొక్కనన్నా రక్షించుకోగలిగిందా? ఎన్ని లాలిత్యాలు వదులుగా తెచ్చుకొని ఎంతటి సౌందర్యంలో నాని వచ్చేవని—కొన్ని–రోజులు,—కొన్ని–వారాలు,—కొన్ని—నెలలు—వుండి, ఎన్నెన్నో ఆశలు రేకెత్తించి, ఊహ తీయనచేసి, చివరికి విషం చేసేసాయిగదా! ఒక్క మొక్కనన్నా లోకం నింద కడుక్కోవడం కోసమన్నా, నిలుపుకోలేకపోయిన తన శక్తిని శంకించిన ప్రతిసారీ ఆమె పోలేరమ్మని స్మరించుకొని—

కలువరేకుల మీంచి జలబిందువులు రాలాయి!

ఈ మొక్కని కూడా తను రక్షించుకోలేదా! పుట్టి రెండేళ్ళయిందేమో! ఎన్ని గండాలు! ఎన్ని బాలారిష్టాలు! పురుగుపట్టి ఆ లేత ఆకులు రాలిపోతున్నప్పుడు, నిర్జీవంగా బలహీనమై వాడిపోతున్నప్పుడు, ఆమె కూచొని తలబద్దలు కొట్టుకొనేది పోలేరమ్మ ముందు. అమ్మా! యీ ఒక్క మొక్కని బతికించు. గంపెడు గులకరాళ్లెందుకు? యీ ఒక్క రత్నమూ నీ వరప్రసాద మనుకొంటాం. నిన్నేకొలుచుకొంటాం. ఏటేటా మొక్కులు తీర్చుకొంటాం తల్లీ! ఇంక మాటలు పెగిలేవికావు. కన్నీరు తప్ప.

ఆ మొక్క పోయిందంటే రత్నాలమ్మగుండెలోని గాలి పంచ భూతాల్లో లీనమైపోతుంది. సందేహంలేదు. ఆ ఒక్క మొక్కని దినమో గండంగా పెంచుతోన్నది—కన్నీటితో. అది వాడిపోతూండడం, ఆకులు నాలుగయిదు రాలడం. భయం వేసింది. మొరపెట్టుకొంది.

"అప్పన్నా! ఓ రెణ్ణెల్లు మేకపాలు సంపాదించగలనంటే చెప్పు. మందిస్తాను" అన్నాడు ఆ వూరి వైద్యుడు, కన్నీటికి కరిగి ఆమె భర్తతో.

మేకపాలు సంపాదించడం కూడ కష్టమనిపించే పేదరికంలో ఆ సంసారం కొట్టుకుపోతోంది. ఎక్కడన్నా యింత ఆధారం దొరక్కపోతుందా, ఈ ప్రవాహంలోంచి బయట పడకపోతానా అనే ఆశతో అప్పన్న కళ్ళు మిగిలాయి. ఓతరం నాగరికతను తప్పించుకొన్న సనాతనుడు అప్పన్న అనుకోడానికి, జుత్తు ముడి, చెవుల్లో కందిగింజలంత కన్నాలు సాక్ష్యం.

రత్నాలమ్మ వీథిలోకి చూపులు తిప్పింది.

ఎదురింటి నాయుడిగారమ్మాయి తన పాపని వుయ్యాల్లోంచి యెత్తి, ముద్దిడుకొని, గుండెల్లో దాచుకొంది. అబ్బ! తన జీవాలు అమృతంతో నిండి, పొంగి కన్నీరులా అప్రయత్నంగా జారినపుడు—ఎదురింటి నాయుడిగారి భార్య ఏడు దినాల పాపని విడిచి చనిపోతే, తను తల్లి అయింది. కాని ఒక్కరోజు 'అమ్మా' అని—ఇప్పుడా పాప—ఓ తల్లి!

బరువుగా చూపులు కిందికి దిగేసరికి పాలలోని నెమరు వేసుకొంటున్న మేక కనిపించింది. ఆ మేకని చూస్తే ఆమెకి

జారి. గత జన్మలో ఏ మహాతల్లో, ఈ జన్మలో ఈ మేకయిందని ఆమె నమ్మకం. పోలేరమ్మ తనకోసం ఈ అవతార మెత్తిందని అనుకొన్న రోజులు కూడా వున్నాయి. ఆ మేక—లోకం మిథ్యని స్పష్టమయినపుడు—సత్యమైన జ్ఞానంవేపు మనసు తిప్పుకొనే అంతరేక్షణలో వున్నట్టు—పడుకొని చూస్తోంది. పాలకోసం చిన్నారి మేకపిల్ల విరహంతో రోదిస్తోంది. పట్టించుకోవడం లేదు తల్లి. తనకి యజమాని అనబడ్డ ఓ వ్యక్తి వున్నాడని వాడే అన్ని అవసరాలు చూసుకొంటాడని మేక పరధ్యానం.

ఆమెకి సిగ్గేసింది. అబ్బో! ఆ మేక తనింటికివచ్చి రెండో ఈత యీనింది. మొదటి యీత మొగది. అది యిపుడు యెగువీధిలో తన తమ్ముడింట వుంది. అది మిగిల్చిన పాలతో తన మొక్క పెరిగింది. నవ నవ లాడింది. ఆ మేకపోతు ఈ మొక్కకి తమ్ముడు. మొక్క 'అమ్మా' అని మేకని పిలవదు. పిలచినా మేక సంబరపడిపోదు—భ్రమన్నట్టు, కల్పన ఐనట్టు. తన కక్కర్లేని సర్వ సంఘ పరిత్యాగిలా చూస్తుంది. తన ఆ చిన్నారి మొక్కని చూస్తోంటే గర్వంగా వుండేది. భయం పోయేది. ఆ వృక్షం యెండిపోయినా పోనీ. యిది మిగుల్తుంది. యిది చాలు. పూస్తుంది. ఎన్నో కాయలు కాస్తుంది. అన్నీ కాయలూ పళ్ళు కాకపోయినా కొన్నన్నా అవుతాయి. ఇదంతా ఆ మేక చలవ. ఆ పోలేరమ్మ చల్లని చూపు. మరోసారి వందనం చేసింది తల్లికి—రత్నాలమ్మ—భయంతో, భక్తితో.

తన పక్కలోని బాబు కదిలాడు. రత్నాలమ్మ వేయి కళ్ళతో వెదికింది. మళ్ళీ సర్దుకొని నిద్రలో ముకుళించుకు పోయాడు. మేకపిల్ల ఆకలి రోదన వినిపించింది. అంత అరుస్తోంది ఆపిల్ల. ఆ తల్లికి పాలిద్దామనే బుద్ధిలేకపోయినా, లేచన్నా చూడదేం? పశువులూ అంటారు. అందుకే. అయినా బిడ్డతీపి దానికేం తెలుసు? ఆ మామిడిచెట్టూ, ఈ మేక ఒక్కలాంటివే. అది తన మొక్కలు గతించినపుడు కన్నీరు కార్చ లేదు. తనకు తెలీనట్టు, బాధ లేనట్టు, తన అధీనం కానట్టూ వూర్కొంది. ఈ మేక కూడా అంతే యిపుడు. 'అమ్మా! ఇదేమి లీల!''

ఒక్క మొక్కనన్నా నిలబెట్టుకోలేకపోయింది. పాడు ముండచెట్టు. దరిద్రం. అరిష్టం. ఎన్ని మొక్కలు పుట్టాయని! అన్నిటినీ తిన్నది. పాపిష్టిముండ. పిల్లలని తినేస్తోంది. రాక్షసి అని లోకం నిందించింది చెట్టుని. ఆ మొక్కలని తెంచే యటానికి ఆ భగవంతునికి యెలా వచ్చాయో చేతులు! ఆమె తోట మొక్క దగ్గర కూచొని, నే నీ మొక్కని తీసేసినట్టే, నా మొక్కనీ భగవంతుడు తీసేస్తే. . . .' అనుకొనేది. ఆమె చేతులు వణికేవి. కళ్ళు చీకట్లుకమ్మి భూమి గిర్రున తిరిగేది. అక్కణ్ణించి లేచిపోయేది. అవును. ఆ మొక్కలన్నీ వుంటే—ఎంత కళకళ్ళాడేదో తోట! ఎన్ని పూవులు! ఎన్ని పండేవో! ఎంత సింగారంగా వుండేదో!

నాలుగేళ్ళ మొక్కయిందని, నవనవలాడుతోందని సంబరమేగాని, యిది మాత్రం బ్రతుకు అరణ్యరోదన చేయదని నమ్మకమేమిటి? సంవత్సరంక్రితం మేకపోతు విరిచేయబో లేదూ—ఓసారి.

రత్నాలమ్మ పెరటిలోని మొక్కని చూసింది. ఆమె శరీరం జలదరించింది. భయం వేసింది. మనస్సులో చీకటి కమ్ముకొంది. చీకటిలో దీపంలా కన్పించింది పోలేరమ్మ. ఆ దీపం చూపిస్తుంది దారి అని ఆమె ఆశ. అది మరో దీపంగా వెలిగింది. దీపాలు వెలుగుతున్నాయి. అంతే. చీకటి వుండనే వుంది. ఆ చీకటి వుండకూడదని, ఈ దీపాల వెలుగుతో దారి స్పష్టమవాలనీ ఆమె ఆశ. కాని ఆ దీపాలు వెలుగులో వుంటే వాటికి మాత్రం విలువేమిటి? లోకం ఈ దీపాలని తృణప్రాయంగా చూడదా? అలాంటి ప్రశ్నలవేపు ఆమె యెపుడూ మనసు తిప్పలేదు. ఇంకా భయం వేస్తూనేవుంది. అందుకే గద—ఆ మేకపోతుని యెగువీధిలో తమ్మునింట విడిచినది. అబ్బో! ఆ మొక్కని తన పొట్టలో పెట్టుకొనేదే. పోలేరమ్మ రక్షించింది.

* * *

రత్నాలమ్మ పొరుగింట్లోకివెళ్ళింది గాబోలు. అమ్మ వంటింట్లో వుంటుందని, అంతవరకూ బయట పిల్లలతో ఆడుకొన్న బాబు, వంటింట్లోకి దూరాడు—'అమ్మా' అని పిలుస్తూ. నల్లగా కన్పించింది. గదిలో చీకటి. కుండలు శబ్దం చేస్తోంది. సన్నని ద్వారం. ద్వారం దగ్గర బాబు. భయంవేసింది బాబుకి. భయంతో జడిసి కేకేసాడు. కేకకి ఉలికిపడింది మేకపోతు. అప్పటికి సంవత్సరంది. నడుమెత్తుంది. బయటికి వచ్చే ప్రయత్నంలో పొడిచేసింది. బాబు యింకో గావుకేక వేసాడు. పడిపోయిన బాబు మీంచి మేకపోతు చెంగున యెగిరిపోయింది. తనమీంచి యెగిరిపోతున్న మేకపోతునిచూసి, బాబు, భయోత్పాతంగా అరిచాడు. ఇంతలో రత్నాలమ్మ వచ్చింది. తెగిన కొమ్మలా పడిపోయి, లబో దిబోమంటూ బాబుని గుండెకు హత్తుకుంది.

రెండు దినాల జ్వరం క్రమంగా వారానికి పెరిగింది. పక్షమయింది. వైద్యులు పెదవి విరిచారు. కలవరించేవాడు బాబు. పెద్ద పెద్ద కేకలు భయంకరంగా వుండేవి. కళ్ళు మూయకుండా చూసేవాడు. పళ్ళు బిగపట్టి పటపటలాడించేవాడు.

రత్నాలమ్మ కళ్ళల్లో దీపాలు పెట్టుకొని చూసింది. చిక్కి శల్యమైపోయింది. ఆ పక్షం దినాలు ఆ కుటుంబంలో

నిద్రాహారాల్లేవు. మేకలని కూడా మరచిపోయారు. మేకపోతు అరచేది. ఇంక దాని బాధ పడలేక తమ్మునింటికి పంపించేసింది.

భూతవైద్యుని తెచ్చి చూపించమన్నారు వూర్లో పెద్దలు. వాడో అపరసంధ్యవేళ అయినింటిలో, ఓ చదరంలో రంగుల ముగ్గు వేసాడు. కోడి కావాలన్నాడు బలికి. సారా కావాలన్నాడు మత్తుకి. మందారపూలూ, నవధాన్యాలూ, మొక్కుబడులూ అన్నీ చెల్లించుకొని వికారంగా, భీతిజనకంగా ధ్వనులుచేసి కులదేవత అని చెప్పి వెళ్ళిపోయాడు.

రత్నాలమ్మ తన ప్రాణాన్ని బాబులో దాచుకొని చూసేది. విషాదాంతమౌతోన్న మాతృత్వంలో బహిర్గతమయ్యే అంతిమయత్నమూ, సాహసమూ ఆమెలో కన్పించేవి.

రెండోరోజు దాసుణ్ణి తెచ్చారు.

అయినింటిలో తూర్పున ఓ చదరపు గజం భాగం ఆవు పేడతో అలికాడు. పద్మంలా ముగ్గు వేసాడు. ముగ్గుమీద ముంత పెట్టాడు. ఆముంతమీద పది వత్తులతో దీపాలు వెలిగించాడు. ఒక్కో వత్తికి ఒక్కో దేవత—పేరు. ఏ వత్తి పూలు రాలిస్తే ఆ దేవత పలికినట్టు. ఆ దేవతని కొలవాలి. అప్పుడే మొక్కుబడులేవిటో చెబుతుంది దాసుడి వాణిగా—ఆ దేవత.

చుట్టూ పదిమంది అమ్మలక్కలు మూగారు—ఏ దేవతో చూడాలని. నీలదీసి అడగాలని.

జ్యోతులు వెలుగుతున్నాయి.

ముఖం నిర్మలంగా, కళ్ళు కాంతివంతంగా, తీవి గంభీరంగా వుండి, ఆకర్షణీయంగా వున్నాడు దాసుడు. నుదుట కుంకుమ నిలువబొట్టు కొత్త తేజస్సుని ప్రసాదిస్తోన్నది. జుత్తు ముడి విప్పారి వీపుమీద వ్రేలాడుతోంది. బొద్దు మీసాలు, నెరసీ నెరవని గడ్డమూ, పసుపు పచ్చ పంచె, శాంత స్వరూపం అనాది మునీశ్వరులని స్మృతిలో నిలుపుతున్నాయి.

కనులు మూసికొని అవధాన ఆవాహనంకోసం ఆలాపన చేసాడు. అది క్రమంగా ఆ చుట్టూవున్న జనంలో మానసికాతీతమయిన పారవశ్యతని కలిగించే రాగంగా మారింది. జ్యోతి పువ్వులు రాల్చింది. కులదేవత! పోలేరమ్మ!

ముంత, వెలుగుతున్న వత్తులతో, తలమీదుంది. దాసుడు కంఠం హెచ్చించాడు. "ఓరి నరుడా. . . .నరుడా..... నీవు కంటి కింపయినవి కనిపిస్తే నను మరచిపోతావురా! నరుడా—ఓరి నరుడా....' నీకునీవే శత్రువ్వేర .... నన్నిడవురు నరుడా .... దూతలు నన్నిడవురా' అంటూ తన్నెప్పుడో మరచారని, ఎన్నో కష్టాల్లో ఆ కుటుంబాన్ని ఆదుకొంటోందని, 'ఏ పుష్పానికి నీడనై కాపాడుతున్నానుర నరుడా. . . .దూతలు తినేస్తున్నార్ర. . . . నా యాగభోగాలు మరచినావుర. . . .నా గుడిలో ధూప దీపాల్లేవుర. . . .నాకు పూజా పుష్పమూ లేదుర. . . .అని కోరిక చెప్పింది.

'తల్లి పిల్లమీద కోప్పడితే అవుతుందా?' 'ఆ పసికందుని అలా నులిమేయడం నీకు ధర్మమా తల్లీ' 'నీ కంటే మా కింకో దిక్కెవరున్నారమ్మా' అని అక్కడున్న అమ్మలక్కలు తలో ప్రశ్నవేసి, నిలదీసి అడిగారు.

రత్నాలమ్మ మొక్కుబడి చేసింది. కొడుకు పది దినాలకి లేచి కూచొంటే, వచ్చే భాద్రపదమాసంలో, మొక్కుబడి తీరుస్తానంది.

*　　　*　　　*

చాల రోజులనించి తొందరపడుతున్న ఆ రోజే యిది. గుర్తు రావడంతో రత్నాలమ్మ బద్ధకంగా లేచి నిలుచొంది. తేనెరంగు శరీరం, ఆమె హృదయంలోని మాతృత్వం అవయవాల్లోనూ, చూపుల్లోనూ స్పష్టమౌతోంది. పన్నందనంవలన పొడవరిలా ఐ పూలతో బరువెక్కిన లతలావుంది.

*　　　*　　　*

గ్రామానికి పశ్చిమాన కొండలమీది సూర్యునికి మేఘాలు నీలం మణులతో గుడికట్టాయి. దూరంనించి భక్తజనంలా రంగు రంగుల మేఘాలు, వేడుకలతో, మొక్కుబడులతో బాజా భజంత్రీలతో వస్తున్నాయి. పైరుగాలి పల్లవి పాడుతోంది. హృదయంలో అమరగానం దివ్య సందేశాల నీనుతోంది.

కొత్త ప్రవాహంలా జనం. నవ వధువుని చూస్తున్నట్టున్నాయి చెట్లు. గట్లు దాటితే యిరుప్రక్కలా తీయని ఊహలు మోస్తున్న సస్యలక్ష్మి. రత్నాలమ్మ పూజ మోస్తోంది. దాసుడు ధూప దీపాలు అర్పిస్తున్నాడు. ఉపవాసంలో వుండడం వలన భక్తి గాఢమూ, నిర్మలమూ అవటంవలన ఆమె లాక్షారుణ రూపానికి దైవ వర్చస్సు తోడయింది. పువ్వు చుట్టూ నాట్యమాడే భ్రమరంలా, సామాన్యుడు సహితమూ ఆమె కాంతితో ఆకర్షింపబడుతున్నాడు. కళ్ళు పవిత్రతని కురుస్తోన్నాయి. ఆమె యే పరవశతతో నడుస్తోందో అగోచరం.

అప్పన్న మిగతా అవసరాలని తీర్చే హడావిడిలో దాసుడి దగ్గరే నడుస్తున్నాడు. భార్యను చూస్తోంటే భక్తిభావం పొంగుకొస్తోంది. భార్య కాదామె అప్పుడు. పోలేరమ్మ. అమ్మలకి అమ్మ.

రత్నాలమ్మ భర్తని చూడడంలేదు. బాబునీ వెతకడం లేదు. ఈ జనమూ, ఈ కోలాహలమూ ఆమెకి తెలుస్తున్నట్టు

లేదు. వేణుగానంవేపు పరవశంగా పరులెత్తే గోమాతలా పోతోంది.

గుడి చేరారు. వేపచెట్టుకింద పన్నెండడుగులకంటె యెత్తుండని చిన్న గుడి—చుట్టూ మొగలి పొదలు. జనం గాలికివూగే పూల తోటలా కన్పిస్తున్నారు. చెదిరిపోయిన పాద రసంలా సౌందర్యం కదులుతోన్నట్టుంది.

దాసుడు, గుడిలో పోలేరమ్మ పూజలుచేస్తున్నాడు. హృదయాలని క్షణం సత్యంతో వత్తెక్కించే వాసన లక్కడ సుళ్ళు తిరుగుతున్నాయి. శ్రవణేంద్రియాలకు సానపెట్టే కోలాహలం. రత్నాలమ్మ యేం చేస్తోందో ఆమెకి తెలీడంలేదు. దేవి తన సజీవతకి ఆమె నుపయోగించుకొన్నట్టయింది. దాసుడు చేయమన్నదంతా చేస్తోంది. ఓ పది హేను నిమిషాలు హడావిడితో పూజ పూర్తయింది.

అంతా పక్కకి తప్పుకొన్నారు. దేవి చూపులకు ఎదురుగా, పది గజాలదూరంలో మేకపోతును నిలబెట్టారు. మచ్చలేని నల్లని మేక. బలంగా పెరిగింది. దాన్ని సరిగ్గా నిలబెట్టడానికి నలుగురి ప్రయత్నం అవసరం అవుతోంది. కొమ్ములకు కర్ర నేసి కట్టిపట్టుకొన్నా డొకడు. సరిగా నిలబడడంలేదు. వెనుక కాళ్ళతో గెంతు లేస్తోంది. ఓ దృఢకాయుడు వెనుక కాళ్ళు గట్టిగా పట్టుకోవాల్సి వచ్చింది.

దేవి చూస్తోంది—గుడిలోంచి. జగన్నాథస్వామి దగ్గర సుభద్రాదేవిలా గుండ్రని కళ్ళు. పసుపుపచ్చని ఛాయ. నల్లని చీర. అభయహస్తం. సృష్టిలోని ప్రేమతో మత్తెక్కిన చూపులు. అంతటి హృదయం ఈ మేకపోతు బలి కోరిందంటే—అందరూ నమ్ముతున్నారు. నిరోధించే యత్న మొక్కరిలోనూ కన్పించలేదు. చిన్న పిల్లలని దూరంలో వుంచుతున్నారు పెద్దవాళ్ళు. కాని బాబు నెత్తుకొన్న తమ్ముడు మాత్రం ఆమేక పోతుని చూస్తూ, దగ్గరే నిలబడ్డాడు.

మెరుపూ మెరుస్తున్న కత్తి, బలంగా, పిడుగులా కిందికి పడేసరికి మేఘాలు ఆఖరిగా ఉరిమి, రక్తంలో మునిగితేలాయి. తమ్ముడిచేతవున్న బాబు, మేకపోతు గిజ గిజ తన్నుకోవడం, రక్తం దేవి యెదురుగా చిమ్మడం చూసాడు. అలా తన్నుకొంటుంటే బాబుకి తనమీంచి యెగురుతోన్నట్టు అయింది. తన గుండెమీద నిలబడ్డట్టయింది. కళ్ళుమూసికొని గావు కేక వేసాడు. ఆ కోలాహలంలో ఆ కేక రత్నాలమ్మకి వినిపించిందో లేదో!

సూర్యుడు లేడు. వెలుగు చీకటవుతోంది. జనం యిళ్ళకి తిరిగి పోతోన్నారు. అంతా కార్యం జయప్రదంగా ముగిసినందుకు సంతోషంగా వున్నారు. రత్నాలమ్మకి దినమంతా వ్రతపాలన—నీరసం—దేవి మొక్కుబడి తీర్చాలనే పట్టుదల — తీర్చామనే సంతోషం—సంతృప్తి మొదలయినవి కలిసి, యింకో యోచనకు దారే లేకపోయింది. ఆ జనం వెనుకగా నలుగుర మనుషులు ఆ మేకపోతు కళేబరం మోసుకొస్తున్నారు.

మేఘాలన్నీ చెదిరిపోయాయి. జనంలో స్తబ్దత పెరిగింది—ప్రకృతి మౌనంగా వున్నట్టు.

నవమి వెన్నెల. పలచని తేలిక మేఘాలు పాప తల్లిలా వున్నాయి. శీతలం అనుకోడానికి వీల్లేని గాలి వీథుల్లో కుంటిగా తిరుగుతోంది.

రత్నాలమ్మ ఇల్లు చేరుకొని, కొంత విశ్రాంతి తీసుకొని యింత ప్రసాదం తిని, వాస్తవజీవితంలోకి కోలుకొంది. అప్పటికి వూర్లో, భోజనాల వేళయిందేమో, మాటు మణిగినట్టు నిశ్శబ్దంగా వుంది.

పెరటికి వెళ్ళింది. దూరాన మోడవుతోన్న వృక్షం కింద చిన్న సందడి వెన్నెల్లో కన్పించింది. ఓ కొమ్మకి మేక పోతుని వ్రేలాడగట్టి చర్మం వొలిచి మాంసం తీస్తున్నారు. ఆ చూపులు దగ్గరకు తీసుకొనేసరికి మొక్క మొదలంటా నరకబడి విరిగిపడివుంది. ఎవరు??! ఎవరు?!! బయట తమ్ముని చుట్టూ జనం మూగివున్నారు. వైద్యుని గొంతులో వైరాగ్యం విన్పిస్తోంది. ఆమె పాదాలకింద భూమి గిర్రున..... గిర్రున తిరుగుతోంది. "నే నీ మొక్కని తీసేసినట్టే—నా మొక్కని భగవంతుడుతీసేస్తాడు'. తినేస్తాడు. తన పాలతో మేక తన మొక్కని రక్షించింది. తన బిడ్డని మేక—తన బిడ్డ కోసం బలి యిచ్చింది. తన బిడ్డని తనే తినేసింది. తను రాక్షసి. పిల్లలని తినేస్తోంది. పాడుముండ. అబ్బ! కళ్ళు చీకట్లు...... గిర్రున......గిర్రున భూమి.

మేక అరుపు......బాబు గావు కేకలు.....విరిగిపోయిన చిన్నారి మొక్క......మోడయిపోతున్న వంశవృక్షం.....దేవి మొక్కుబడి బలి......అన్నీ.....బ్రహ్మాండంలా పెరిగి, పెరిగి ఆమెని శూన్యంలోకి విసిరేస్తున్నట్టయింది. శూన్యంలోకి. శూన్యం......లోకి!

ఎప్పుడో, ఎక్కడో యిలాంటిదే, చూసినట్టో, విని నట్టో అనుభవంలా, కలలా, స్మృతి. అప్పటి కామె భూత మావేశించినట్టు పామునోటిలోని కప్పలా, 'వొద్దూ...వొద్దూ' అని అరచి వీథిలోకి దుమికి పడిపోయింది.

ఆ పడిపోయిన శబ్దంతో మేక తుళ్ళిపడి లేచింది. పడుకొన్న, పక్కనున్న మేకపిల్ల కూడ లేచింది భయంతో.

శబ్దం లిప్తలో నిశ్శబ్దంలో లీనమైపోయింది.

ఆమె చుట్టూ కంటనీరుపెట్టే జనం పోగయారు.

అప్పన్న హృదయవిదారకంగా రోదిస్తున్నాడు విహ్వలుడై.

ఆ వీథి మధ్య జనం రొదగానీ, రోదనగానీ, మేక లక్ష్య పెట్టలేదు. "ఎప్పుడూ వుండేదే" అనే సత్యం తనకు తెలిసినట్టు, తనకు సంబంధించనట్టు పడుకొని నెమరువేసుకొంటోంది—నిర్విచారంగా, సుఖ దుఃఖాలకు అతీతంగా. మేకపిల్ల కూడ.